క్లుప్తంగా

వాగులు దాటొద్దు

ఏటూరునాగారం: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు వాగులు దాటే ప్రయత్నం చేయద్దని ఏటూరునాగారం ఏఎస్పీ శివమ్ ఉపాధ్యాయ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరి ముంపు ప్రాంతాల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు, ఇళ్లలోని విద్యుత్ వైర్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు సహాయం అవసరమైతే పోలీసులకు, కంట్రోల్ రూంల ఫోన్ నంబర్లకు ఫోన్ చేసి విషయం తెలిపితే తక్షణ సాయం అందుతుందని తెలిపారు.

పరామర్శ



ములుగు రూరల్: మండలంలోని దేవనగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కునవేని వెంకటమల్లు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మంత్రి సీతక్క ఆదివారం పరామర్శించి వెంకటమల్లు మృతదేహానికి నివాళులర్పించారు. అలాగే అదే గ్రామానికి చెందిన కదారి సోమక్క మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా, మండల నాయకులు ఉన్నారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి



భూపాలపల్లి అర్బన్/ భూపాలపల్లి రూరల్: ప్రతి కాలనీలో కాలనీవాసులందరు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ నరేష్‌కుమార్ కోరారు. పట్టణంలోని హైటెక్ కాలనీ, జీఎంఆర్ కాలనీల్లో కాలనీ వాసులతో ఆదివారం సమావేశం ఏర్పాటు చేసి సీసీ కెమెరాల ప్రముఖ్యతను సీఐ వివరించారు. పలు కాలనీల్లో జరిగిన దొంగతనం కేసుల్లో సీసీ కెమోరాల ఆధారంగా నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు. పట్టణంలోని ప్రతి కాలనీల్లో సీసీ కెమోరాల ఏర్పాటుపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.

శ్రావణమాసం ఆదాయం రూ.40.74లక్షలు

కాళేశ్వరం: ఆగస్టు 3వ తేదీన ప్రారంభమైన శ్రావణమాసం నేటితో (సోమవారం) ముగియనుంది. మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానానికి నెల రోజులుగా నెల రోజులగా ఆలయంలో తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామివారి గర్భగుడిలో ప్రత్యేక అభిషేక పూజలు, లక్షబిల్వార్చన(లక్ష పత్రి) పూజలను అత్యధికంగా నిర్వహించారు. దీంతో పాటు ప్రసాదాల ద్వారా ఆలయానికి రూ.40.74లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ వర్గాలు తెలిపారు.

కలిసికట్టుగా ముందుకు సాగాలి

మహాముత్తారం: నేటి నుంచి మండలంలో నిర్వహించే బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మేడిపల్లి పూర్ణచందర్ కార్యకర్తలకు సూచించారు. ఆదివారం మండలంలోని యామన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ బూతులో 200 సభ్యత్వలు నమోదు చేయాలని అన్నారు. అదే విధంగా త్వరలో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకోని అందరం కలిసి కట్టుగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీని యర్ నాయకులు కల్వచర్ల రాజు, బౌతు లచ్చయ్య, బూత్ అధ్యక్షుడు మంద రాజు, గుగ్‌లోత్ వంశి, నరేష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విష జ్వరంతో వ్యక్తి మృతి



భిక్షపతి (ఫైల్)

ములుగు రూరల్: విష జ్వరంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని జంగాపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. జంగాలపల్లి గ్రామానికి చెందిన కూచనపల్లి భిక్షపతి (40) కుల వృత్తి చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. కుటుంబ పోషణ గడవక ఇటీవల హనుమకొండకు వెళ్లి జీవనం కొనసాగిస్తూ ఇటీవల గ్రామంలో శ్రావణ మాసం సందర్భంగా పోచమ్మ తల్లి బోనాల కోసం వచ్చి అనంతరం అనారోగ్యం బారిన పడ్డాడు. స్థానికంగా చికిత్స అందించిన ఫలితం లేకపోవడంతో హనుమకొండలోని ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం అందించిన కూడా మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏటూరునాగారం: నిండుకుండలా మారిన ఓంపెల్లి చెరువు



వాజేడు: ఉధృతంగా ప్రవహిస్తున్న కొంగాల వాగు



ఏటూరునాగారం: బూటారం వద్ద జంపన్నవాగును పరిశీలిస్తున్న ఎస్సై తాజొద్దీన్



దంచికొట్టిన వాన

పొంగిన వాగులు వంకలు

ఎస్ఎస్‌తాడ్వాయి: గాలివాన బీభత్సవంతో మండలంలోని కొండపర్తి గిరిజన గ్రామం శనివారం రాత్రి అతలాకుతలమైంది. గాలి దుమారానికి గ్రామంలోని ఇళ్లపై పెంకులు పగిలిపోవడం తోపాటు రేకులు కిలోమీటర్ల దూరంలో పడ్డాయి. వర్షానికి ఇళ్లలోని సామగ్రి తడిచి ముద్దయింది. కరెంట్ స్తంభాల వైర్లపై చెట్లు పడడంతో గ్రామం అంధకారంలో ఉంది. విద్యుత్ సరఫరాల లేకపోవడంతో గ్రామంలో తాగునీటి సౌకర్యం లేకుండా పోయింది. చేతి పంపుల నీటినే వాడుకుంటున్నారు. వరుణదేవుడు కనికరించకపోతే ప్రాణాలకు నష్టం వాట్లిలేదని వాపోయారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, మేడారం జాతర మాజీ చైర్మన్ అర్రెం లచ్చుపటేల్, మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్, పార్టీ నాయకులు గ్రామస్తులకు భోజనాలు వడ్డి పెటించారు.

రోడ్లు ధ్వంసం

భారీ వర్షానికి పస్రా తాడ్వాయి మధ్య మొండ్యా తోగు సమీపంలోని బ్రిడ్జి వద్ద రోడ్డు భారీగా కోతకు గురైంది. జలగలంచ బ్రిడ్జిపై నుంచి వరద ప్రవహించడంతో బ్రిడ్జిపై రోడ్డు కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. రోడ్లు ధ్వంసం కావడంతో పోలీసులు తాడ్వాయి నుంచి పస్రా మీదుగా భారీ వాహనాలను అనుమతించలేదు. భారీ వాహనాలను తాడ్వాయి నుంచి మేడారం మీదుగా మళ్లీంచారు. మండల కేంద్రంలోని తాడ్వాయిలో కూడా జాతీయ రహదారిపై వరద కోతకు గురైంది. రెండు మీటర్ల లోతున రోడ్డు కోతకు గురికావడంతో రోడ్డు పక్కన ఉన్న ఇళ్లలోకి వరద చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

వాజేడు: భారీ వర్షానికి మండలంలోని వాగులన్ని పొంగి ప్రవహిస్తున్నాయి. కొన్ని చోట్ల పంట పొలాలను వర్షం నీరు ముంచెత్తింది. మండల పరిధిలోని వాజేడు, గుమ్మడి దొడ్డి రహదారికి అడ్డంగా ట్రాక్టర్ ట్రాలీని ఏర్పాటు చేశారు. వర్షాలు భారీగా పడుతుండటంతో అటు వైపుగా వాహనాలు వెళ్లకుండా రహదారికి అడ్డంగా ట్రాక్టర్ ట్రాలీ ఉంచారు.

వెంకటాపురం(కె): మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. గిరిజన గ్రామాలైన కలిపాక, ముత్తారం, పెంకవాగు, కర్రవాని గుంపు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారి పక్కన ఉన్న విద్యుత్ పోల్ విరిగి రోడ్డుమీదకు వంగడంతో విద్యుత్ లైన్లు రోడ్డుపై చేతులకు అందే ఎత్తులో ఉన్నాయి.

ప్రమాదపుటంచున అలుగుబెల్లి చెరువు

ఏటూరునాగారం: భారీ వర్షాల కారణంగా మండలంలోని శివాపురం ప్రాంతంలోని అలుగుబెల్లి శివారు చెరువు ప్రమాదం అంచున ఉంది. వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో చెరువు కట్ట కోతకు గురవుతుంది. కరకట్ట తెగితే ఆయకట్టు కింద ఉన్న వరిపొలాలు సైతం నీటిపాలు అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఇరిగేషన్ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

మంగపేట: మండలంలోని కొత్తూరుమొట్లగూడెం పంచాయతీ పరిధిలోని బొమ్మాయిగూడేనికి రవాణా సౌకర్యం ఆదివారం సాయంత్రం నుంచి పూర్తిగా నిలిచిపోయింది. రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో బొమ్మాయిగూడెం, మొట్లగూడెం గ్రామాల మధ్య గల గౌరారంవాగు ప్రధానరోడ్డుపై నిర్మించిన లోలెవల్ కాజ్వే పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తుంది. వరద ప్రమాదం పొంచి ఉండటంతో అధికారులు వాగు వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసి రాక పోకలు పూర్తిగా నిలిపివేశారు. వరద ఉధృతిని పంచాయతీ కార్యదర్శి పాషా, సిబ్బంది మోహన్‌కృష్ణ ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

ఉప్పొంగిన దయ్యాల వాగు.. ఇళ్లలోకి వచ్చిన వరద నీరు

గోవిందరావుపేట: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రంలోని దయ్యాలవాగు పొంగి పొర్లుతుంది. లక్నవరం చెరువు మత్తడి పోయడం వల్ల దయ్యాలవాగు ఉగ్రరూపం దాల్చింది. పైనుంచి వచ్చే వరద తాకిడితో మండల కేంద్రంలోని లోతట్టు ప్రాంతం శివారు ఇళ్లలోకి వరద నీరు వచ్చి చేరింది. దీంతో వారిని అధికారులు పునరావాస కేంద్రంలోకి తరలించారు. మండల పరిదిలోని ప్రాజెక్ట్ నగర్ గ్రామాన్ని వరదనీరు చుట్టూ ముట్టింది. ప్రాజెక్ట్ నగర్‌లోని రైతుల విద్యుత్ మోటార్లు వాగుల ఉధృతికి కొట్టుకపోయి, వరి పంటలు మునిగిపోయాయి. వరదల తాకిడితో వరి పంటలపై ఇసుక మేటలు వేయడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. పస్రా, తాడ్వాయి మధ్యలో జాతీయ రహదారి తెగిపోవడంతో అధికారులు పస్రాలోనే భారీ వాహనాలను నిలిపి వేశారు. మండలంలోని బుస్సాపూర్ గ్రామ సమీపాన ఉన్న పర్యాటక కేంద్రం లక్నవరం సరస్సుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో సందర్శకులు ఎవరు కూడా రావద్దని పస్రా ఎస్సై కమలాకర్ తెలిపారు.

టేకుమట్ల: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులు పూర్తిగా నిండి మత్తడి పోస్తున్నాయి. అలాగే మండలంలోని చలివాగు, మానేరులో నిండుకుండలా వరద ప్రవాహం కొనసాగుతుంది.

రేగొండ(కొత్తపల్లిగోరి): రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కొత్తపల్లిగోరి మండలంలోని జమ్‌షేడ్‌బేగ్‌పేట వద్ద నిర్మిస్తున్న నూతన బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన తాత్కలిక రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తుంది. దీంతో రేగొండ నుంచి కొత్తపల్లిగోరికి రాకపోకలు నిలిచిపోయాయి.



గోవిందరావుపేట: వరద ఉధృతికి పొలాల్లోకి చేరిన ఇసుక మేటలు



కొండాయి వద్ద తెగిన కరకట్ట



ఏటూరునాగారంలో ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్న వాగు



మంగపేట: ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



ఏటూరునాగారం: తెగిపోయిన కరెంటు తీగలు



వాజేడు: వాహనాలు వెళ్లకుండా ఉంచిన ట్రాలీ



కటాక్షపూర్ వద్ద వాహనాలను దారి మళ్లిస్తున్న పోలీసులు



వెంకటాపురం(కె): ఉధృతంగా ప్రవహిస్తున్న కంకల వాగు

సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలి



ఏటూరునాగారం: జాలర్లకు లైఫ్‌జాకెట్స్, టార్చిలైట్స్‌ను అందజేస్తున్న అధికారులు



ఏటూరునాగారం: కొండాయిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



గోవిందరావుపేట: భోజనం వడ్డిస్తున్న ఎంపీడీఓ జవహార్ రెడ్డి

ఏటూరునాగారం: లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని తహసీల్దార్ జగదీష్, సీఐ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని కొండాయి, మల్యాల గ్రామాల్లో అధికారులు పర్యటించి ముంపు ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారీ వర్షాల వల్ల కొండాయి జంపన్న వాగు మరింత ఉప్పొంగే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలన్నారు. జాలర్లు, ఫైర్ సిబ్బందికి టార్చ్ లైట్, అదనపు లైఫ్ జాకెట్స్, రైన్ కోట్స్‌లను అందజేసినట్లు తెలిపారు. మల్యాల, కొండాయి గ్రామాల్లోని, గోవిందరాజుల కాలనీలోని ప్రజలు ఇళ్లలో ఉండవద్దని విన్నవించారు. ఇందు కోసం కావాల్సిన ఏర్పాట్లు చేశామన్నారు. ఆర్ఐ కిరణ్, ఫైర్ స్పెషల్ ఆఫీసర్ కుమారస్వామి, జూ నియర్ అసిస్టెంట్లు నాగేష్, నర్సింహారావు ఉన్నారు.

గోవిందరావుపేట: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని లోతట్టు ప్రాంత ప్రజలను గుర్తించి ఆయా పునరావాస కేంద్రాలు స్థానిక పాఠశాలలకు అధికారులు తరలించారు. మండల అధికారులు ఎంపీడీఓ జవహార్ రెడ్డి ఆదివారం మండల కేంద్రలోని దయ్యాల వాగు శివారులో గల ముంపు ప్రాంతం విల్సన్ కాలనీ ప్రజలను స్థానిక పాఠశాల పునరావాస కేంద్రంకు తరలించి భోజనాలు ఏర్పాటు చేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు పునరావాస కేంద్రాల వద్దనే ఉండాలని అందుకు కావాల్సిన ఏర్పాట్లను ప్రభుత్వం చూసుకుంటుందని అన్నారు.

జలసవ్వడి..



బొగత జలపాతం

వాజేడు: మండలంలోని చీకుపల్లి సమీపంలోని బొగత జలపాతం జలసవ్వడి సంతరించుకుంది. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వరద పోటెత్తుతోంది. జలపాతం జాలువారుతూ పరవళ్లు తొక్కుతున్నాయి. పాలనురగలాంటి తెల్లని జలధారలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. కాగా, వరద ఉధృతతో బొగత స్నానాల కొలను ఆదివారం మునిగింది.

సీపీఎస్ రద్దుకు ఐక్య పోరాటాలు



ములుగు: కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ములుగు: సీపీఎస్ రద్దు కోరుతూ ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 1ని పెన్షన్ విద్రోహ దినంగా భావిస్తూ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాకేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వర్షంలోనూ కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఐక్య పోరాటాలకు తామంతా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రాబోయే రోజులలో సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానం సాధించేవరకు పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షన్ సంఘాల జేఏసీ జాయింట్ కన్వీనర్, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్, జిల్లా అధ్యక్షులు శిరప సతీష్, జేఏసీ కో కన్వీనర్, సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు అన్నవరం రవికాంత్, ప్రధాన కార్యదర్శి, ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు మంకిడి రవి, టీఈఏ జిల్లా అధ్యక్షులు గుల్లగట్టు సంజీవ, టీటీయూ జిల్లా అధ్యక్షులు సర్వర్ అహ్మద్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు హట్కర్ సమ్మయ్య, సేవాలాల్ సేన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు పోరిక సునీల్ నాయక్, ప్రధాన కార్యదర్శి కుమార్ పాద్య పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను అమలు చేయాలి

ఏటూరునాగారం: సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొయ్యడ సురేందర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2004 తర్వాత ఉన్న ఉద్యోగులకు సెప్టెంబర్ 1 నుంచి సీపీఎస్‌ను అమలు పర్చడంతో ఆ రోజు చీకటి రోజు అని అన్నారు.

పోచమ్మ బోనాలు

టేకుమట్ల: మండలంలోని వెలిశాలలో గ్రామస్తులు పోచమ్మ బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలందరూ బోనాలతో పోచమ్మగుడికి చేరుకున్నారు. భక్తి శ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చింతలపెల్లి విజయాస్వామిరావు, బండి రజిత, భారతి, మమత, స్వరూప, పద్మ, తదితరులు ఉన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్కలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ సరళ

భూపాలపల్లి రూరల్: మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలని కాలనీవాసులకు కౌన్సిలర్ కాగవెళ్లి సరళ రాజ లింగమూర్తి సూచించారు. వన మహోత్సవంలో భాగంగా ఆదివారం 15వ వార్డు, కాకతీయ కాలనీ, ఇంద్రానగర్‌లో ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి కౌన్సిలర్ సరళ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు బాదం ప్రణతి, సులోచన, మాటూరు రాధ, సుమలత, సంగీత మాకు జగదాంబ, తిప్పనవేణి సుమలత, రజిత, అంతడుపుల మమత, రజిత, అరుణ మరియు కాలనీవాసులు పాల్గొన్నారు. అదేవిధంగా 17వ వార్డులో కౌన్సిలర్ మురళి, 29వ వార్డులో కౌన్సిలర్ చల్లూరి మమత కమలాకర్ మొక్కలు పంపిణీ చేశారు.

సెల్ టవర్లను తొలగించాలి

భూపాలపల్లి అర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డులోని కారల్ మార్క్స్ కాలనీలో ఉన్న సెల్ టవర్లను తొలగించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం కాలనీ వాసులతో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాత్యరాజు సతీష్ మాట్లాడుతూ.. పది సంవత్సరాల క్రితం నుంచి సెల్ టవర్‌ను తొలగించాలని ప్రజలు తెలుపుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదదని ఆరోపించారు. సెల్ టవర్ అనుమతులను రెన్యువల్ చేసి అధికారులు సహకరిస్తున్నట్లు వాపోయారు. రేడియేషన్ వలన చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిపారు. వెంటనే టవర్లను తొలగించాలని లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కాలనీవాసులు శ్రీకాంత్, రాజేష్, మహేష్, రాంబాబు, సంతోష్, యాకుబ్‌పాషా ఉన్నారు.